క్లుప్తంగా

హైదరాబాద్‌కు తరలిన తెయూ బీఆర్‌ఎస్వీ నాయకులు



తెయూ(డిచ్‌పల్లి): భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం(బీఆర్‌ఎస్వీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే శిక్షణ తరగతులకు శనివారం తెలంగాణ యూనివర్సిటీ బీఆర్‌ఎస్వీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు శ్రీను రాథోడ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపట్టనున్న బనకచర్ల ప్రాజెక్టు ఆపాలని, జరుగుతున్న నీటి దోపిడీని అడ్డుకోవాలని బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు ఆకాశ్, మల్లేశ్, శివ ప్రసాద్, పల్లె అంజి, శ్రీహరి, రాజు, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ పోరాట ఫలితమే ఇంజినీరింగ్ కోర్సులు



డిచ్‌పల్లి(తెయూ): పీడీఎస్‌యూ చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులు పెట్టాలని నిర్ణయించిందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థి సంఘం చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల నిలదీతల వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెడుతున్న దృష్ట్యా క్యాంపస్‌లో వెంటనే బాలికల వసతి గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. కోర్సులకు అవసరమైన ఫ్యాకల్టీని భర్తీ చేయాలన్నారు. నాయకులు రాకేశ్, గౌతమ్‌రాజ్, రాజేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

సిర్‌పూర్ ప్రైమరీ స్కూల్‌లో నో బ్యాగ్ డే



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగవ శనివారం సందర్భంగా నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెడుతూ కాగితాలతో వినూత్న ఆకృతులను తయారు చేశారు. వాటిని తోటి విద్యార్థులతో కలిసి తరగతి గదిలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంత, అనురాధ, గంగాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రావుట్లలో గోపాల కాల్వలు



సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా గోపాల కాల్వలను శనివారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో శివుడి పల్లకీ సేవ చేపట్టారు. ఉట్టి కొట్టడానికి యువకులు పోటీ పడ్డారు. మండలంలోని అన్ని గ్రామాల కంటే ముందుగా రావుట్లలో గోపాల కాల్వలను నిర్వహించడం అనాదిగా ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,900	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	92,220	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	30	50	దోసకాయ	10	20
దొండకాయ	10	20	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	30	60
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	40	60
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	50	80
పుదీనా	40	80	గోరుచిక్కుడు	35	60
క్యాప్సికం	40	80			

–సుభాష్‌నగర్



బోసిపోయిన ఎల్లమ్మగుట్ట రోడ్డు

రోజంతా వాన..

జిల్లాలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే దేవీరోడ్డు చౌరస్తా, ఎల్లమ్మగుట్ట చౌరస్తా, పాత కలెక్టరేట్ ప్రాంతాలు వర్ష ప్రభావం వల్ల బోసిపోయాయి. కొందరు ప్రయాణికులు గొడుగులు పట్టుకొని ప్రయాణాలు సాగించారు. సిరికొండ మండలంలో 22 మి.మీ వర్షపాతం నమోదైంది. కప్పలవాగు, మొండి వాగు, దొండ్లవాగు, తెల్లపలుగు వాగు, దెయ్యంమడుగులు ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. ఇందల్వాయి సిర్నాపల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఉన్న జానకీబాయి చెరువు పూర్తి స్థాయిలో నిండడంతో అలుగు పారుతోంది.





– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్/సిరికొండ/ ఇందల్వాయి

నేటి చిత్రం



వంతెనపై ఏర్పడ్డ గుంతలు

ప్రమాదకరంగా వంతెన

సిరికొండ: మండల కేంద్రానికి సమీపంలో దొండ్ల వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. వంతెనపై స్లాబ్ ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి గుంతల్లో నీళ్లు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మామిడికింది మహిపాల్, న్యావనంది

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

సాహిత్య సమరాల సవ్యసాచి దాశరథి

నిజామాబాద్ రూరల్: ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య జీవితంలో పోరాటం, సాహిత్యం సమాంతరంగా సాగాయని గ్రంథాల్లో ఆయన సాహిత్య సమరాల సవ్యసాచిలా విజయాలు సాధించాడని సారంగపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఘనపురం దేవేందర్ అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి తెలంగాణ సాహిత్యకాడమీ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని సాహిత్య అకాడమీ సమావేశ మందిరంలో నిర్వహించిన దాశరథి సాహితీ సప్తాహంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో 'బ్యారక్ నంబర్ 8' కవితను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రముఖ తెలంగాణ చరిత్రకారుడు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారిలు ఘనపురం దేవేందర్‌ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, కారం శంకర్, డాక్టర్ సుంకరి రమేశ్, పోతన జ్యోతి, శరణ్య, సోమశిల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



దేవేందర్‌ను సన్మానిస్తున్న తెలంగాణ సాహితీవేత్తలు

రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఇందల్వాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, కాంగ్రెస్ నాయకులు శనివారం చేపట్టారు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డులు చేతికి అందడంతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, మండలంలో 3030 నూతన రేషన్ కార్డులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దన్నరాజు, నాయకులు సుధాకర్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ సిటీ: వృక్షాలను మనం రక్షిస్తే అవి మానవాళికి రక్షణ నిస్తాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖైసర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సభ్యుడు జీవీ రామకృష్ణ, జిల్లా ఆర్టీఏ సభ్యుడు నరేందర్‌తో పాటు పలువురు మొక్కలు నాటారు. మైనార్టీ గురుకుల పాఠశాల సిబ్బంది, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కాంగ్రెస్ నాయకులు

సత్యం రెడ్డి సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం భట్టాపురం సత్యంరెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రావ్య గార్డెన్‌లో నిర్వహించిన సత్యంరెడ్డి ద్వాదశ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో పీఆర్టీయూ సంఘం పక్షాన ఎన్నో సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శిస్తే సహించేది లేదు

- మోపాల్‌లో రేషన్‌కార్డుల పంపిణీలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: దళితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేసిన కేటీఆర్‌కు.. కాంగ్రెస్‌ను, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, మరోసారి పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఎస్‌ఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భూపతిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీ తోడు దొంగలని, రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులురాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వైఎస్ బీసీలకు 34శాతం రిజర్వేషన్ ఇస్తే.. బీఆర్‌ఎస్ పదేళ్లు 27శాతం మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. పాత డిజైన్ ప్రకారం మంచిప్ప ప్రాజెక్ట్ పనులు చేసేందుకు సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఒప్పుకున్నారని, 15 రోజుల్లో జీవో వస్తుందని, త్వరలో జరిగే సీఎం ప్రసంగంలో మంచిప్ప ప్రస్తావన ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ ఏ ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వలేదని, 18 నెలల్లోనే ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, రేషన్‌కార్డులతోపాటు అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనా విధానాన్ని ప్రజలు గమనించాలని, పేదోడి ప్రభుత్వమని తెలిపారు. సమావేశంలో నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ లింగన్న, మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు, నాయకులు కెతావత్ యాదగిరి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి





మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మారుతీనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న అండర్ గ్రౌండ్ మ్యాన్‌హోల్స్‌కు సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్ అనే కథనం 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 26న ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బంజారా ఆత్మీయ సమ్మేళనం



మోపాల్: నగర శివారులోని బృందావన్ గార్డెన్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బంజారా ఆత్మీయ సమ్మేళనానికి గిరిజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఎల్ బాలు నాయక్ కోరారు. శనివారం మోపాల్ మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి జాతీయ అధ్యక్షుడు ఉమేశ్ జాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ హాజరవుతారని అన్నారు. సమావేశంలో నాయకులు హరి నాయక్, కమలాజీ, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి



జక్రాన్‌పల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులు శ్రీవైష్ణవి, బ్లెస్సన్, ఆకాశ్‌లను ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శ్యామ్, కొప్పు రాజేందర్, హెచ్‌ఎం కమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్

నిజామాబాద్ రూరల్: మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ అన్నారు. శనివారం ముబారక్‌నగర్‌లో ఉన్న విజయ్ హై స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైం, మహిళలను వేధిస్తే చేపట్టే చర్యల గురించి వివరించారు. ఎవరైనా మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీఎస్, ఆర్‌ఎస్సై స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



జ్వరాలతో బాధపడుతున్న వారితో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మంచిప్పలో గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: సీజనల్ వ్యాధులు, డెంగీ ప్రబలకుండా జీపీ సిబ్బంది, వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలడంతో మండలంలోని కాల్పోల్ గ్రామ పాఠశాలలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని రూరల్ ఎమ్మెల్యే సందర్శించారు. డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ,, జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రత్యూష, అజ్మల్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. తండా ప్రజలు పూర్తిగా కోలుకునే వరకూ వైద్యశిబిరం కొనసాగించాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం డెంగీ, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే వర్షంలో తడుస్తూ పరామర్శించారు. అనంతరం మండలంలోని మంచిప్పలో గోదాములను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మోపాల్ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, కాంగ్రెస్ ఆదివాసి, గిరిజన చైర్మన్ కెతావత్ యాదగిరి, బాడ్సి చైర్మన్ మోహన్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ గోవింద్‌రావు, ఎంపీడీవో రాములు నాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ సరిత, నాయకులు ప్రతాప్ సింగ్, గంగాప్రసాద్, లింగన్న, ప్రవీణ్‌రెడ్డి, రాములు, మోహన్ నాయక్, కిరణ్‌రావు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదులు

గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచకపోవడం వల్లే ప్రజలు డెంగీ, సీజనల్ వ్యాధులు బారిన పడ్డారని పంచాయతీ కార్యదర్శి మోహన్‌పై గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని పంచాయతీ కార్యదర్శిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. తాగునీటి క్లోరినేషన్, పరిసరాల పరిశుభ్రత, వర్షపు నీరు నిల్వ, తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు.

పంటలకు ప్రాణం

- కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో హర్షం
- వరి, మొక్కజొన్న పంటలకు జీవం



బర్ధిపూర్‌లో వర్షానికి జీవం పోసుకుంటున్న సోయా పంట

నిజామాబాద్ రూరల్: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల పంటలకు ఊపిరి పోసినట్లయింది. ఈ ఏడాది ప్రారంభంలో నైరుతి రుతు పవనాలు ముందుగా ప్రవేశించినా సరైన వర్షాలు కురవలేదు. దీంతో మొదటల్లో పంటలు సాగు చేసే రైతులు వర్షాలు లేక రెండు దఫాలుగా దుక్కిలో విత్తనాలను నాటాల్సి వచ్చింది. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వర్షాల కోసం రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. జూన్‌లో వర్షాలకు వేసిన విత్తనాలు మొలవక పోవటం రైతులను ఆందోళనకు కలిగించింది. కాగా కురుస్తున్న వర్షాలకు పంటలకు ఊపిరి పోసినట్లయింది. మరో రెండు రోజులు జిల్లాకు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే వాగులు, కుంటలు, చెరువులు సగానికి పైగా నిండుకున్నాయి.

పంటలు ఎండిపోయేవి..

నెల రోజుల క్రితం వేసిన సోయాబీన్, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, ఇతర పంటలు వర్షాలు లేక ఎండిపోయే స్థితికి చేరుకున్నాయని రైతులు పేర్కొంటున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలకు ప్రాణం పోసినట్లయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ఎస్సారెస్పీ, నిజాంసాగర్ డ్యాములకు వరద చేరుతుండడంతో ఆయకట్టు రైతులకు కూడా మరింత భరోసా పెరగనుంది. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటలకు ఎలాంటి ఢోకా లేదని రైతులు పేర్కొంటున్నారు.

వర్షంతో ఎంతో మేలు



కురుస్తున్న వర్షంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. నెల రోజుల క్రితం వేసిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు ప్రాణం పోసినట్లయింది.

– కొర్వ గంగాధర్, మాజీ సర్పంచ్, ఖానాపూర్

పంటపై ధీమా పెరిగింది



వర్షాలకు పంటలు పండుతాయని ధీమా పెరిగింది. ఆయకట్టు రైతులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుంటలు, చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతోంది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.

– అగ్గు భోజన్న, కాలూర్, మాజీ సర్పంచ్

రైతులకు ఎంతో ఉపయోగకరం



కురుస్తున్న వర్షం ఆరుతడి, వరి పంటలకు ఎంతో ఉపయోగకరం. నేలలోని పోషకాలను తిరిగి నింపడంలో వర్షం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. నేలలో తేమ తగినంత ఉన్నప్పుడు పంట లు పోషకాలను మరింత సమర్థవంతంగా పొందుతాయి. – హీరాజాదవ్, మండల వ్యవసాయాధికారిణి

ఎంఏ నజీర్‌కు శానిటేషన్ పర్యవేక్షణ బాధ్యతలు

నిజామాబాద్ సిటీ: అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎంఏ నజీర్‌కు పారిశుద్ధ్య బాధ్యతలు అప్పగించారు. ఆర్‌వోగా ఉన్న నజీర్ పదోన్నతి పొంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా చార్జి తీసుకున్నారు. ఇప్పటివరకు పారిశుద్ధ్య పనులు చూసిన డిప్యూటీ కమిషనర్ ఎం.రవిబాబుకు రెవెన్యూ బాధ్యతలు అప్పగించారు. పారిశుద్ధ్య బాధ్యతలను నజీర్‌కు అప్పగిస్తూ మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సర్క్యులర్ జారీచేశారు. శానిటేషన్ విభాగంలో ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, నరేందర్ ఉన్నారు. శానిటేషన్ పనులు ఇకపై నజీర్ పర్యవేక్షించనున్నారు. తోటి ఉద్యోగులు, శానిటేషన్ సిబ్బంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా చార్జి తీసుకున్న ఎంఏ నజీర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దుబ్బ పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలను పరిశీలించారు. 400 మంది విద్యార్థులకు నాలుగే టాయిలెట్స్ ఉన్నాయని, వర్షపు నీరు పాఠశాలలోకి వస్తోందని దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు అఖిల్, సుజిత్, ధర్మేందర్, మహేశ్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.